www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 28 అక్టోబర్ 2025
5
వైఎస్ఆర్



బిఇడి పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగివేమన విశ్వవిద్యాలయ పరిధిలోని వైఎస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లాలోని 17 కేంద్రాలలో బిఇడి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలను అన్ని కేంద్రాల్లో కలుపుకొని 21, 665 మంది విద్యార్థులు రాశారు. తొలిరోజు కడపలోని నాగార్జున డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రాన్ని వైవియూ వీసి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాల్ టికెట్లను, కేంద్రంలోని పరిసరాలను పరిశీలించారు. పరీక్షలు కట్టుదిట్టంగా నిబంధనలను అనుసరించి నిర్వహించాలని సూచించారు. యోగి వేమన విశ్వవిద్యాలయ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ కె.ఎస్.వి.కృష్ణారావు వివరిస్తూ రెండు జిల్లాల్లోని అన్ని కేంద్రాలకు విశ్వవిద్యాలయం తరఫున అబ్జర్వర్లను నియమించామని తెలిపారు. అ స్క్వాడ్ బృందాల సభ్యులు కేంద్రాలను పర్యవేక్షిస్తున్నారని వీసికి వివరించారు.

తాగునీరివ్వని ఎఇపై చర్యలు తీసుకోవాలి

- మున్సిపల్ కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ఐలమ్మ కాలనీ వాసుల ధర్నా

ప్రజాశక్తి-బద్వేలు

సిపిఎం బద్వేలు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పేదలు నివసిస్తున్న ఐలమ్మ కాలనీ వాసులకు తాగునీరు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్న మున్సిపల్ ఎఇ మహేష్ పై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ మేనేజర్కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి కె. శ్రీను మాట్లాడుతూ పట్టణ శివారు ప్రాంతమైన ఐలమ్మ కాలనీ నిర్మించి దాదాపు 20 సంవత్సరాలు అయినప్పటికీ అక్కడ నివసిస్తున్న ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీవర్గాలకు చెందిన పేదలకు బ్రహ్మ సాగర్ మంచినీటి సౌకర్యం లేనప్పటికీ పూర్వపు బోరు మోటర్ ద్వారా వచ్చే మంచినీటిని పైపులైన్ ఏర్పాటు చేసుకొని వీధి కుళాయిల ద్వారా నీరు పట్టుకునేవారని పేర్కొన్నారు. ఒక్కరేని స్థానిక వైసిపి నాయకుడి డ్రైవర్ మాటలకు తలొగ్గి, వైసిపి నాయకులకు ఏజెంట్ లాగా వ్యవహరిస్తూ పేదలు చందాలు పోగేసుకుని ఏర్పాటు చేసుకున్న పైపులైను తొలగించి వేయడం దారుణమని వాపోయారు. ప్రజలు నీటి సౌకర్యం లేకుండా చేసి ఇది ఏమిటని ప్రశ్నించిన పేదలను భయభ్రాంతులకు గురిచేసి దౌర్జన్యం చేస్తున్న బద్వేల్ మున్సిపల్ ఎఇ మహేష్ పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల పన్నులతో జీతం తీసుకుంటున్న ఎఇ ప్రజల సౌకర్యాలను మరచి నాయకుల మాటలకు వత్తాసు పలకడం సరైంది కాదని హితవు పలికారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు పేద ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న మున్సిపల్ ఎఇ పై చర్యలు తీసుకొని పేద ప్రజల నివాసం ఉన్న ఐలమ్మ కాలనీకి మంచినీటి సౌకర్యం కల్పించాలని, నివాసమున్న ప్రతి కుటుంబానికి డోర్ నెంబరు వేసి ఇంటి పన్ను విధించాలని పేర్కొన్నారు. కాలనీలో మౌలిక సౌకర్యాలైన సిమెంట్ రోడ్లు, డ్రైనేజ్ కాలువలు, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు ముడియం చిన్ని, చెప్పలి సుబ్బరాయుడు, పసువుల మోక్షమ్మ,సగిలి రాయప్ప, శాఖ కార్యదర్శులు షేక్ మస్తాన్ బీ, మూర ప్రసాద్, నాయకులు రాజగోపాల్, ఫాతిమా, బాలస్వామి పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న ఐలమ్మ కాలనీ వాసులు

ఆందోళన అవసరం లేదు

- ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్

ప్రజాశక్తి - కడప

మొంథా తుపాన్ ప్రభావం ప్రారంభం అయిన నేపథ్యంలో ఆందోళన అవసరం లేదని, అప్రమత్తంగా ఉండాలని ఎలాంటి విపత్తులు ఎదురైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్ జిల్లా అధికారులకు సూచించారు. మొంతా తుపాన్ పరిస్థితులను ఎదుర్కొనే చర్యలు, సంసిద్ధతపై ఆమెఉ జిల్లా స్థాయి అధికారులతో సోమవారం సాయంత్రం టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎటువంటి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, పంట నష్టం జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై తగు సూచనలు చేశారు. మండలాల వారీగా చెరువు కట్టలు, కాలువ గట్ల పరిరక్షణపై దృష్టి పెట్టాలని, వాగులు, వంకలు, కుంటల వద్ద అప్రమత్తంగా ఉండాలని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అధిక వర్షాలు కురవడం వలన రిజర్వాయర్లు, నదులు, వాగులు, వంకలు, చెరువుల ఉప్పొంగే అవకాశాలు ఉన్నందున పరివాహక ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తూ అవసరమైన సహాయక చర్యలను అందించేందుకు సంబంధిత సిబ్బందితో 24 గంటలు సిద్ధంగా ఉండాలన్నారు. ఇరిగేషన్ అధికారులు, ఇంజినీర్లు చేపట్టాల్సిన భద్రతా చర్యలపై అలర్ట్‌గా ఉండాలని పేర్కొన్నారు. జిల్లా అధికారులు మొదలు నియోజకవర్గ, మండల, సచివాలయ, గ్రామ స్థాయి వరకు ప్రతి అధికారి సిబ్బంది వారి వారి కార్య స్థానాలలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అన్ని రెవెన్యూ డివిజన్ల పరిధిలో పోలీసు, అగ్నిమాపక సిబ్బందితో పాటు రెస్క్యూ టీమ్ ను కూడా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని ఏరియా ఆసుపత్రులు, పిహెచ్‌సిలలో సకాలంలో డాక్టర్లు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. సందర్భంగా ఆయా శాఖల అధికారులు చేపడుతున్న ముందస్తు సంసిద్ధత ఏర్పాట్లపై సమీక్షించారు. అత్యవసర సహాయ సమాచార నిమిత్తం జిల్లా కలెక్టరేట్ కార్యాల యంలోని కంట్రోల్ రూంతో పాటు కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్‌డిఒ కార్యాలయాల్లో 24 గంటలు పని చేసేలా కంట్రోల్ రూమ్ నెంబర్లను సద్వినియోగం చేసుకునేలా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్

ఫ్రీ హోల్డ్ నిషేధాన్ని ఎత్తివేయటం అన్యాయం : వ్య.కా.స

ప్రజాశక్తి - కడప అర్బన్

అసైన్డ్ భూముల ఫ్రీ హోల్డ్ పై ఉన్న నిషేధాన్ని త్వరలోనే తొలగించి రాష్ట్ర ప్రజలకు తీపి కబురు చెబుతామని ఈనెల 24న నిర్వహించిన మంత్రివర్గ ఉప సంఘం ప్రకటించడాన్ని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివకుమార్, అన్వేష్ తీవ్రంగా ఖండించారు. సోమవారం వ్య.కా.స జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇది భూ కబ్జాదారులకు తీపి కబురు, లక్షలాదిమంది దళిత, బలహీనవర్గాలకు చేదు కబురు అన్నారు. గడిచిన ఐదు దశాబ్దాలుగా ప్రభుత్వాల నుంచి లబ్ధి పొందిన దళిత, బలహీన వర్గాలకు చెందిన అసైన్డ్ భూములను పలుకుబడి కలిగిన వారికి, గ్రామీణ సంపన్నులకు కట్టబెట్టడానికే ఈ ఫ్రీ హోల్డ్ పై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయడానికి రాష్ట్ర మంత్రివర్గ ఉప సంఘం నిర్ణయం చేసిందని తెలిపారు. 2023లో అప్పటి వైసిపి ప్రభుత్వం గడచిన 50 ఏళ్లలో అసైన్డ్ భూములు పొందిన పేదలు 20 ఏళ్ళు అనుభవించిన తర్వాత అమ్ముకోవచ్చు, కొనుగోలు చేయచ్చని 9/77 చట్టాన్ని సవరించిందని చెప్పారు. వ్యవసాయ కార్మిక సంఘాలు, సామాజిక సంస్థలు తీవ్రంగా వ్యతిరేకించాయని, పెద్ద ఎత్తున పోరాటం చేశాయని పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు తాము అధికారములోకి వచ్చిన వెంటనే అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములపై సమగ్రంగా విచారించి అక్రమంగా స్వాధీనం చేసుకున్న పెత్తందారుల నుంచి భూములు వెనక్కు తీసుకుని తిరిగి పేదలకు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 2025, మార్చిలో మంత్రి వర్గ ఉప సంఘం నియమించిందని పేర్కొన్నారు. రెండుసార్లు గ్రామ రెవెన్యూ సదస్సులు పెట్టిందని, కానీ రాష్ట్రంలో ఎక్కడ ఒక్క ఎకరం అనర్హుల చేతుల్లో ఉన్న భూమి తీసుకుని పేదలకు ఇవ్వలేదని విమర్శించారు. ఒక్క అక్రమదారునిపైన చర్య తీసుకోలేదని తెలిపారు. అసైన్డ్ భూములకు రక్షణ కవచంగా ఉన్న 9/77 చట్టాన్ని యధాప్రకారంగా అమలు చేసి అనర్హుల చేతుల్లో ఉన్న అసైన్డ్ భూములను కోల్పోయినటువంటి దళిత, గిరిజన బలహీన వర్గాల పేదలకు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కూటమి ప్రభుత్వం కూడా లక్షలాదిమంది దళిత, బలహీన వర్గాలకు తీవ్రమైన ద్రోహం చేసినట్టేనని తెలిపారు. ఇదే పద్ధతి ప్రభుత్వం కొనసాగిస్తే వ్యవసాయ కార్మిక సంఘం సామాజిక సంఘాలను, కలిసొచ్చే సంఘాలను కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళన, పోరాటాలకు సిద్ధం అవుతామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న అన్వేష్

వరసిద్ధి వినాయక పంచమ వార్షికోత్సవం

ప్రజాశక్తి-కలసపాడు

మండలంలోని వినాయక నగర్‌లో సోమవారం వరసిద్ధి వినాయక స్వామి పంచమ వార్షికోత్సవం అత్యంత ఘనంగా కాలనీ వాసులు నిర్వహించారు ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు అలంకరణ అభిషేకాలు నిర్వహించారు అనంతరం గోపవరం తిరుపతిరెడ్డి ప్రజలకు అన్నదానం నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా బండలాగుడు పోటీలను నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కలసపాడు ఎస్ఐ ఎల్. థిమోతి ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

పునరావాస కేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి- కలసపాడు

రాష్ట్రంలో మొంథా తుపాన్ ప్రభావంతో వర్షాలు కురవనున్న నేపథ్యంలో కలసపాడు మండలంలో బద్వేల్ ఆర్‌డిఒ చంద్ర మోహన్ ఆదేశాల మేరకు కలసపాడు తహశీల్దార్ మధు రవాణి సింగరాయపల్లె గ్రామ ప్రజలకు వాగు ముప్పు ఉండడంతో ముందస్తులో భాగంగా కలసపాడు బాలుర ఉన్నత పాఠశాలలో బాధితులకు పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అక్కడ ప్రజలకు అన్ని రకాల వసతులను సమకూర్చారు. ఎక్కడైనా ఇబ్బందులు ఏర్పడితే టోల్ ఫ్రీ నెంబర్9030134306 కు సమాచారం అందిస్తే వారికి వసతి కల్పిస్తామని తహశీల్దార్ పేర్కొన్నారు.



ఉద్యోగోన్నతులు వెంటనే కల్పించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

వైద్య ఆరోగ్యశాఖలో అన్ని కేడర్లలో పనిచేస్తున్న ఉద్యోగులకు వెంటనే ఉద్యోగోన్నతులను కల్పించాలని ఎపి ఎన్‌జిజిఒ జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు మాధవ, కార్యదర్శి నిత్యపూజయ్య కోరారు. సోమవారం రీజినల్ డైరెక్టర్ డాక్టర్ రామగిడ్డయ్యను కలిసి విజ్ఞప్తి చేశారు. మహిళా సూపర్‌వైజర్‌కు పిహెచ్ఎన్‌గా, ఎంపిహెచ్ఎస్ (ఎం)లను ఎంపిహెచ్ఇఒగా, హెల్త్ ఎడ్యుకేటర్ నుంచి డిప్యూటీ డెమోగా, సీనియర్ ఫార్మసీ ఆఫీసర్ నుంచి చీఫ్ ఫార్మసీ ఆఫీసర్‌గా ఉద్యోగోన్నతలు కల్పించాలని కోరారు. ఇప్పటికే రిటైర్మెంట్ అవుతున్నారని పేర్కొన్నారు. స్పందించిన ఆర్‌డి రెండు, మూడు రోజుల్లో సీనియర్టీ లిస్ట్ రెడీ చేసి డిబిపి కి పంపిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పద్మనాబరావు, కంబదూరు తాలూకా యూనిట్ ట్రెజరర్ మధుబాబు, రాయదుర్గం నాయకులు అది భయమ్మ, మహిళ సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్‌డికి బొకే అందజేస్తున్న శ్రీనివాసులు

విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించండి

- సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలో వివిధ ప్రాంతాల్లో దెబ్బతిన్న, వంగిన విద్యుత్ స్తంభాలను తక్షణమే అధికార యంత్రాంగం పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టాలని సిపిఎం నగర కార్యదర్శి ఎ.రామమోహన్ డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని సాయిపేట, రూకవారిపల్లె ప్రాంతాల్లో సిపిఎం ప్రతినిధి బృందం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా పర్యటించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలు కురుస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో అనేక ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయని, కొన్ని స్తంభాలు ఒరిగి ఉన్నాయని తెలిపారు. రూకవారిపల్లె అంగన్వాడీ కేంద్రం వద్ద ఉన్న విద్యుత్ స్తంభం ఒరిగిపోయిందని, వర్షం ఎక్కువ వస్తే రోడ్డు మీద పడే ప్రమాదం ఉందని చెప్పారు. అంగన్వాడీ కేంద్రానికి చిన్నపిల్లలు, తల్లులు, బాలింతలు వస్తుంటారన్నారు. చెన్నూరు మండల విద్యుత్ అసిస్టెంట్ ఇంజినీర్ తక్షణమే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలన్నారు. వీటితోపాటు రూకవారిపల్లెలో మురుగునీరు వెళ్లే కాలువను పూడ్చారని, నీరంతా రోడ్డు మీదనే నిలబడుతుందని, ఫలితంగా విషజ్వరాలు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని వాపోయారు. ప్రజలు రాకపోకలకు కూడా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం సచివాలయ అడ్మిన్‌కు వినతిపత్రం సమర్పించామని తెలిపారు. తక్షణమే సమస్యను పరిష్కరించకపోతే రానున్న కాలంలో ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రజా చైతన్య యాత్ర పర్యటనలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి. మనోహర్, జిల్లా కమిటీ సభ్యుడు దస్తగిరిరెడ్డి, నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, నరసింహ స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



ఒరిగతిన స్తంభాన్నిచూపుతున్న సిపిఎం నాయకులు



అవగాహన కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది

బ్యాంకింగ్ పద్ధతులను తెలుసుకోవాలి

- కెనరా బ్యాంక్ రీజినల్ హెడ్ బి.అరుణ జ్యోతి

ప్రజాశక్తి - కడప

సురక్షితమైన, పారదర్శక బ్యాంకింగ్ పద్ధతులను ప్రజలు తెలుసుకొని అవగాహన పెంపొందించుకోవాలని కెనరా బ్యాంక్ రీజినల్ హెడ్ బి.అరుణ జ్యోతి అన్నారు. సోమవారం కడప నగరం 7 రోడ్ల కూడలిలో గల కెనరా బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం వద్ద విజిలెన్స్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నిజాయితీ, అవినీతి నిర్మూలన వంటి విలువలను ప్రోత్సహిస్తూ కార్యక్రమం నిర్వహించామన్నారు. ర్యాలీ ద్వారా విజిలెన్స్ అవగాహనను పెంపొందించడంపై సిబ్బంది దృష్టి సారించిందని ఈ సందర్భంగా ఆమె అన్నారు. ఖాతాదారుల అవగాహన ప్రాముఖ్యతను ప్రస్తావించి, సురక్షితమైన, పారదర్శక బ్యాంకింగ్ పద్ధతులను ప్రోత్సహించామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్లు ఎస్. రమేష్, విశ్వనాథ్, విలియం ప్రజలకు మార్గనిర్దేశం చేస్తూ, విజిలెన్స్ అవగాహనను విస్తృతంగా చాటడంలో ముఖ్య పాత్ర పోషించారు.

కువైట్‌లో సంతకాల సేకరణ అభినందనీయం

ప్రజాశక్తి - కడప : మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కువైట్‌లో సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభించడం అభినందనీయం అని కోడూరు మండల కన్వీనర్ రామిరెడ్డి ధ్వజరెడ్డి అన్నారు. మాలియా ప్రాంతంలో మాక్స్ హోటల్‌లో కువైట్ వైసిపి కన్వీనర్ ముమ్మడి బాలిరెడ్డి ఆధ్వర్యంలో మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా కోడూరు మండల కన్వీనర్ రామిరెడ్డి ద్వాజ రెడ్డి, బద్వేల్ నియోజకవర్గం బూత్ కన్వీనర్ కల్లూరు రమణ రెడ్డి, కడప యువ నాయకులు కువైట్ పిస్తా హౌస్ అధినేత ఎస్.బి. అహమద్ బాష హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ నాయకుడు జగన్ మోహన్‌రెడ్డి వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం జగన్ మోహన్ రెడ్డి ఏర్పాటు చేసిన ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరణ చేయడం చాలా దుర్మార్గమన్నారు. కూటమి ప్రభుత్వానికి చేతనైతే పేద విద్యార్థుల కోసం నడపాలని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కమిటీ గల్ఫ్ కో - కన్వీనర్ గోవిందు నాగరాజు, గల్ఫ్ సలహాదారులు నాయని మహేశ్వర్ రెడ్డి, గల్ఫ్ ప్రతినిధి నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, వైసిపి కువైట్ కో - కన్వీనర్లు మన్నూరు చంద్రశేఖర్‌రెడ్డి, మర్రి కళ్యాణ్,వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సోషల్ మీడియా సోదరులు, పాల్గొన్నారు.

2న 'నాస్మృతి పథంలో' పుస్తకావిష్కరణ సభ

ప్రజాశక్తి- కడప అర్బన్ : వైద్య ఆరోగ్య శాఖ మాజీ మంత్రి శిరిగిరెడ్డి రామమునిరెడ్డి రచించిన నా స్మృతి పథంలోఅనే పుస్తకాన్ని వైఎస్ఆర్ కడప జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో నవంబర్ 2న ఉద యం 10 గంటలకు కడప ద్వారకా నగర్‌లో ఉన్న శ్రీ కృష్ణాలయం సమావేశ మందిరంలో ఆవిష్కరిస్తున్నట్లు రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రామమునిరెడ్డి తన స్వీయ చరిత్రను రచించారని, ఆయన తన బాల్యం, విద్యాభ్యాసం, వివాహం, వ్యాపారం, రాజకీయ జీవితం,తదితర అంశాలను రాశారని పేర్కొన్నారు.

మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

- 12వ పిఆర్‌సిని ప్రకటించాలి

ప్రజాశక్తి - బద్వేలు

మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనూరు శ్రీనివాసులరెడ్డి, యూనియర్ రాష్ట్ర కమిటీ సభ్యులు బిర్రు విజయ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక శ్రీనివాస ఫంక్షన్ హాలలో బద్వేల్ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్(సిఐటియు) సోమవారం బద్వేలు పట్టణ 7వ మహాసభలు పులిశ్యాం ప్రవీణ్, దియ్యాల హరి, దియ్యాల దేవమ్మ అధ్యక్షతన నిర్వహిచారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి నరేంద్ర మోడీ సర్కార్ కార్మిక హక్కులను కాలరాసే విధంగా 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందని చెప్పారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేస్తుందని, రాష్ట్రంలో కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులతో సహా ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్న 12వ పిఆర్‌సిని కూటమి ప్రభుత్వం వెంటనే ప్రకటించి జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. డిఎ, సరెండర్ లీవ్ బకాయిలు చెల్లించాలని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మున్సిపల్ కార్మికుల సమ్మె కాలపు ఒప్పందాలకు జీవోలు జారీ చేయాలని పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన 13 గంటల పని దినాన్ని రద్దు చేయాలని, మహిళ కార్మికులతో రాత్రి పూట షిఫ్ట్‌లలో పని చేయించే విధానాన్ని స్వస్తి పలకాలని తెలిపారు. రిటైర్మెంట్, అనారోగ్యం, చనిపోయిన వారి స్థానాలలో వారి పిల్లలకు ఉద్యోగ అవకాశం కల్పించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఎన్ఎంఆర్, బదిలీ, కోవిడ్, డైలీవేజ్ కార్మికులకు రూ.21వేలు వేతనం చెల్లించాలని చెప్పారు. పట్టణాల విస్తరణ మేరకు సిబ్బంది సంఖ్యను పెంచడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వెంటనే విడనాలని హితవు పలికారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు కె. శ్రీనివాసులు, సిఐటియు పట్టణ కో -కన్వీనర్ పి.సి. కొండయ్య, ఆవాజ్ జిల్లా అధ్యక్షులు పఠాన్ చాంద్ బాషా, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, యూనియన్ పట్టణ కార్యదర్శి డి.నాగేంద్రబాబు, ఉపాధ్యక్షులు జి. శ్రీనివాసులు, కార్యదర్శులు సత్యరాజు, ప్రవీణ్ కుమార్, పాలయ్య కమిటీ సభ్యులు టి.కిరణ్, పి. రామయ్య,ఐ.చంద్రశేఖర్, పి. పెంచల వరప్రసాద్ పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.



ఐక్యతను చాటుతున్న కార్మికులు, నాయకులు



అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్

దర్గా పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

పెద్ద దర్గా ఉరుసు ఉత్సవాల సందర్భంగా పరిసరాలను శుభ్రంగా ఉంచాలని కమిషనర్ మనోజ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం పెద్ద దర్గా పరిసరాలను పరిశీలించారు. మొదట మాసపేట సర్కిల్ నుంచి కాలినడకన ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ విభాగ అధికారులతో కలిసి దర్గా ప్రాంతాలను పరిశీలించారు. మార్గమధ్యంలో డ్రెయినేజ్ మరమ్మత్తులు, రోడ్లలో ఉన్న గుంతలు, పెండింగ్‌లో ఉన్న పనులను గుర్తించి వాటిని తక్షణమే పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వై.వి. స్ట్రీట్, వన్ టౌన్ సర్కిల్ వద్ద పర్యటించి అక్కడ ఉన్న సమస్యలను పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించాలంటూ అధికారులకు సూచనలు ఇచ్చారు. పర్యటనలో అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్రం, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు విజయ్ కుమార్, ధనలక్ష్మి, ఏడి హార్టికల్చర్ నాగమణి, డిప్యూటీ ఇఇ క్రిష్ణ కుమార్, ఎఇలు లక్ష్మి నారాయణ, శ్రీనివాసులు రెడ్డి, పూర్ణ చంద్ర శేఖర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ నాగ సుబ్బయ్య, పూజిత్ రెడ్డి, టిపిబిఒలు ఆఫ్జల్, సదా శివ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.


న్యాయం చేయండి సారూ!

ప్రజాశక్తి - కడప అర్బన్ : తన సోదరులు తనకు రావాలసిన ఆస్తిని అక్రమంగా కాజేసి అన్యాయం చేస్తున్నారని కడప నగరం నకాష్ కు చెందిన నూర్ మహమ్మద్ ఖురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో డిఆర్‌ఒవిశ్వేశ్వర నాయుడుకు కుటుంబ సభ్యులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ తాను జీవనోపాధి నిమిత్తం హైదరాబాదులో ఉంటున్నానని, తనకు తెలియకుండా, తన ప్రమేయం లేకుండా వంశపారం పర్యంగా వస్తున్న భూమిని తన అన్నదమ్ములు వారి పేరుమీద తప్పుడు రిజిష్టర్ చేయించుకుని ఆన్‌లైన్‌లో మార్చుకున్నారని బోరున విలపించారు. తాను ప్రశ్నించగా దాడి చేస్తున్నారని పేర్కొన్నారు. వారిపై తగు చట్టపరమైన చర్యలు తీసుకుని తనకు రావాల్సిన వాటాను వచ్చేలా చేయాలని కోరారు. వారి తప్పుడు రిజిస్ట్రేషన్‌ను ఆన్‌లైన్ నుంచి తొలగించాలని విన్నవించారు. వారి నుంచి ప్రాణహాని ఉందనితెలిపారు. జిల్లా ఉన్నతాధికారులు పరిశీలించి తనకు రావాల్సిన వాటాను వచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

అవినీతి నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి - కడప

అవినీతి నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఇలాంటి ప్రచారం ఎంతగానో ఉపయోగపడుతుందని డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు అన్నారు. ఎసిబి ఇన్‌స్పెక్టర్ సోమవారం డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడును, కలెక్టర్ కార్యాలయం పరిపాలన అధికారులను కలిసి అవినీతి నిర్మూలనకు సంబంధించి పోస్టర్లను అందజేశారు. పోస్టర్లను జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయ శాఖాధిపతులకు పంపించి, వారి వారి కార్యాలయాలలో విరివిగా అతికించవలసిందిగా, ప్రజలకు అవగాహన కల్పించి అవినీతి నిర్మూలనకు సహకరించవలసిందిగా ఆయన కోరారు.



డిఆర్ఒకు పోస్టర్ అందజేస్తున్న ఎసిబి ఇన్‌స్పెక్టర్

చికిత్స సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కడప

పుట్టినప్పటి నుండి 18 సంవత్సరాలలోపు గల పిల్లలకు పుట్టుకతో వచ్చే ఎదుగుదల లోపాలకు సంబంధించిన పిల్లల తల్లిదండ్రులు కడప రిమ్స్ ఆవరణంలోని జిల్లా సత్వర చికిత్స కేంద్రం, జిల్లా బాల భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన రిమ్స్ ఆవరణంలోని జిల్లా సత్వర చికిత్స కేంద్రం, జిల్లా బాల భవిత కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించి మాట్లాడారు. ప్రత్యేక పిల్లల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. ప్రస్తుత సమాజంలో ప్రత్యేక పిల్లలు కూడా ఉన్నత స్థానాలను అధిరోహిస్తున్నారని చెప్పారు. వీరి కోసం చట్టపరమైన సేవలు, పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని చెప్పారు. ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప వారిని సంప్రదించవచ్చును అన్నారు. అనంతరం వెల్ఫేర్ ఆఫ్ డిఫరెంట్లి ఏబుల్ ట్రాంజెండర్ అండ్ సీనియర్ సిటిజన్ వారి సహకారంతో డాక్టర్లతో ఇద్దరికీ చెవిటి పరీక్షలు నిర్వహించి రెండు హియరింగ్ మిషన్లను అందజేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ ఆఫ్ డిఫరెంట్లి ఏబుల్ ట్రాంజెండర్ అండ్ సీనియర్ సిటిజన్ సూపరిండెంట్, వైద్యులు, సిబ్బంది, పారా లీగల్ వాలంటరీలు, తల్లిదండ్రులు, పిల్లలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయజ్యోతి

ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుంటాం : డిసిసి

ప్రజాశక్తి - కడప

ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడంతో పాటు అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీపై ఉందని డిసిసి అధ్యక్షులు ఎన్. డి. విజయ జ్యోతి అన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి డివిజన్, వార్డు, నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు పోటీ చేసి తప్పక విజయం సాధిస్తారన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీతోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. సోమవారం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విజయ జ్యోతి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతమే తమ లక్ష్యం అన్నారు. రాహుల్ గాంధీ ప్రవేశపెట్టిన ఓట్ చోరీ కార్యక్రమం రాష్ట్రంలో వై.ఎస్. షర్మిల నాయకత్వంలో కడప జిల్లాలో ఇప్పటివరకు 67 వేల సంతకాలు సేకరించి రాష్ట్రంలో 5వ స్థానంలో ఉందన్నారు. రెట్టింపు ఉత్సాహంతో పనిచేసి కాంగ్రెస్ పార్టీని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, ఈనెల 30 వరకు సంతకాలు సేకరించి లక్ష సంతకాలు పైగా చేయించాలని ఏడు నియోజకవర్గాల ఇన్‌ఛార్జులకు, మండల అధ్యక్షులకు సూచించినట్లు తెలిపారు. రాబోయే స్థానిక సంస్థ ఎన్నికలలో కడపలోని ప్రతి డివిజన్లోనూ, నియోజకవర్గాల్లో ప్రతి మండలంలో స్థానిక సంస్థలలో పోటీ చేసి గెలుపొందే విధంగా పని చేస్తున్నామని వారు తెలిపారు. ఇప్పుడు వస్తున్న తుపాన్ ప్రభావంతో ఇబ్బంది పడకుండా కడప జిల్లాలోని ప్రజలందరూ జాగ్రత్తగా, సురక్షితంగా ఉండాలని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా జనరల్ సెక్రటరీ సయ్యద్ గౌస్ పీర్, జమ్మలమడుగు నియోజకవర్గ ఇన్‌ఛార్జి శివ మోహన్ రెడ్డి, మైదుకూరు నియోజకవర్గం ఇన్‌ఛార్జి సుధాకర్ రెడ్డి, కమలాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి అశోక్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బుగ్గవంక డ్యామ్ పరిశీలన

ప్రజాశక్తి - కడప అర్బన్ : కడప నగరంలో రెండు రోజులపాటు భారీ వర్షాల సూచన ఉన్న నేపథ్యంలో సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మనోజ్ రెడ్డి, కడప ఆర్‌డిఒ జాన్‌ఇర్విన్‌తో కలిసి నగరంలోని బుగ్గ వంక డ్యామ్, బుగ్గ వంక లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ శాఖ ఇంజినీర్ జగదీశ్వర రెడ్డితో కలిసి లోతట్టు ప్రాంతాల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అక్కడ ఉన్న సమస్యలను గుర్తించారు. సమస్యలకు తగిన పరిష్కార చర్యలు త్వరితగతిన చేపట్టాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.



రోడ్డు పనులను తనిఖీ చేస్తున్న ఆర్‌అండ్‌బి ఇఇ మాధవి

ప్రమాదకర గుంతలను పూడ్చాలి

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక పులివెందుల రోడ్డులో ఉన్న ప్రమాదకర గోతులను ముందుగా పూడ్చాలని రోడ్డు భవనాల శాఖ ఇఇ మాధవి ఆదేశించారు. పులివెందుల రోడ్డులో జరుగుతున్న పనులను సోమవారం ఆమె తనిఖీ చేశారు. రోడ్డు పనుల నాణ్యతను పరిశీలించారు. అనంతరం ఇఇ మాధవి మాట్లాడుతూ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సిమెంట్ రోడ్డు పనులు నాణ్యతగా ఉండాలన్నారు. కాంట్రాక్టర్‌కు, ఇంజనీరింగ్ అధికారులకు పనులపై సూచనలు చేశారు. పనుల నాణ్యతలో మాత్రం రాజీ పడే ప్రసక్తి లేదన్నారు. నిబంధనల మేరకు పనులు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎఇ మనోహర్‌రెడ్డి, టిడిపి మండల కార్యదర్శి తక్కెల షరీఫ్, అధికారులు పాల్గొన్నారు.



అంధులకు అన్నదానం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

స్థానిక శ్రీవీరనారాయణ స్వామి ఆశ్రమంలో సోమవారం అంధులకు అన్నదానం చేశారు. పట్టణానికి చెందిన చెంచెల సుబ్బరాయుడు 27వ వర్ధంతిని పుర స్కరించుకొని కోడలు రమా, కుమారుడు సుబ్రహ్మణ్యం అన్నదానం చేశారు. అనం తరం సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రతి ఏటా తండ్రి వర్ధంతిని పురస్కరించుకొని సామాజిక కార్యక్రమాలు చేస్తుంటానని తెలిపారు. కుటుంబ సభ్యులు సుమతి, రేవతి, శాంతి, జ్యోతి, శంకర్, ఆశ్రమ నిర్వాహకుడు అనిమెల రామ్మోహన్ పాల్గొన్నారు.

అల్లాడుపల్లెలో ..

చాపాడు : అల్లాడుపల్లె శ్రీవీరభద్ర స్వామి దేవస్థాన ఆవరణలో మెదటి కార్తీక సోమవారం సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ చైర్మన్ పెరుగు వీర నారాయణ యాదవ్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఉత్సవమూర్తులకు పల్లకీసేవ, ఊరేగింపు చేశారు. భద్రకాళి సమేత వీరభద్ర స్వామి అన్నదాన సత్రం, ఆర్యవైశ్య, సర్వజన అన్నదాన సత్రాల్లో అన్నప్రసాద వినియోగం చేశారు.

డాక్టర్ బాషా దంపతులకు సన్మానం

ప్రజాశక్తి - వేంపల్లె

మక్కా యాత్రను ముగించుకుని వచ్చిన డాక్టర్ ఎస్ఎఫ్ బాషా దంపతులను సోమవారం పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా వారు యాత్రపై చర్చించారు. సన్మానించిన వారిలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సుబ్రహ్మణ్యం, అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి, చిన్నకోట్ల నాగరాజు, షఫీ పాల్గొన్నారు.



నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఎఒ జిపి ఓబులేస్

30 నుంచి శనగ విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి - వేముల

వేముల, గొల్లల గూడూరు, పెద్ద జూటూరు రైతు సేవా కేంద్రాల్లో సబ్సిడీ శనగ విత్తనాల నమోదు ప్రక్రియను సోమవారం ఎఒ జిపి ఓబులేసు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం వరకు నమోదు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. మండలానికి 1,400 క్వింటాళ్లు శనగ విత్తనాలు మంజూరయ్యాయని తెలిపారు. నమోదు ప్రక్రియ పూర్తయిన వెంటనే ఈ నెల 30 నుంచి విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతిక పద్ధతులపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-మదనపల్లె

నిర్మాణ రంగంలో తాజా సాంకేతిక పద్ధతులు, ప్రమాణాలపై అధ్యాపకులు, విద్యార్థులు దృష్టి సారించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ (టెక్నికల్ ప్రోగ్రామ్స్) వడ్డె బ్రహ్మేష్ పేర్కొన్నారు. మదనపల్లి సమీపంలోని మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీలో సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సహకారంతో అర్చిటెక్చరల్ మోడలింగ్ యూసింగ్ రెవిట్ అనే అంశంపై ఆరు రోజుల స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బ్రహ్మేష్ మాట్లాడుతూ 'రెవిట్" సాఫ్ట్‌వేర్ ఎంతో ఉపయోగకరమని, ఇది నిర్మాణ నాణ్యత, సామర్థ్యం, మన్నికను పెంచే వినూత్న పద్ధతులను నేర్చుకునేందుకు దోహదం చేస్తుందని పేర్కొన్నారు. నిర్మాణ రంగం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రాజెక్టుల భద్రత, నాణ్యత, విజయం కోసం ఉత్తమ ప్రమాణాలు అవసరమని చెప్పారు. ప్రాజెక్టులు సమయానికి, బడ్జెట్ లోపల పూర్తి కావడంలో నాణ్యత నియంత్రణ కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. సివిల్ ఇంజినీరింగ్ చివరి సంవత్సరం విద్యార్థులకు ఈ సాఫ్ట్‌వేర్ భవిష్యత్ ఉద్యోగావకాశాల దిశగా సహాయకరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపకులపతి డాక్టర్ యువరాజ్, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ యెన్. విజయ్ కుమార్, డీన్ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ డాక్టర్ దీపాంకర్ రాయ్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ కో-ఆర్డినేటర్ డాక్టర్ వి.బి. తురైరాజ్, కె.అనిత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెలుగు కుటుంబానికి నా జీవితం అంకితం

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

వెలుగు కుటుంబానికి తన జీవితాన్ని అంకితం చేస్తున్నానని వెలుగు సంస్థ సెక్రటరీ ఉదయ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఉదయ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు వెలుగు పాఠశాలలో విభిన్న ప్రతిభావంతులు, వృద్ధుల సమక్షంలో అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచి పెట్టిన ఉదయ మోహన్ రెడ్డికి వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు, విద్యార్థులు సిబ్బంది పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దాతలు దుస్తులు బెడ్ షీట్లు, వృద్ధులకు మొప్లర్లు, ఆయాలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉదయ్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ వృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల సమక్షంలో తన పుట్టినరోజు జరుపుకోవడం ఎంతో గర్వంగా ఉందన్నారు. వీరితోనే తన జీవితం ముడిపడి ఉందని, వెలుగు కుటుంబంతోనే తన ప్రాణం ఉందని, వెలుగు కుటుంబ సభ్యులతోనే జీవితాంతం వరకు గడుపుతానని స్పష్టం చేశారు. కన్వీనర్ భాగ్యలక్ష్మి, ట్రెజ రర్ రఘునాథరెడ్డి, ప్రిన్సిపల్ మీనా కుమారి, వార్డెన్ స్వీటీ, సిబ్బంది పాల్గొన్నారు.

పంటలకు నష్టపరిహారం చెల్లించాలి

నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేతో రైతులకు ఇక్కట్లు - పొలాల్లోకి వర్షపునీరు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

బెంగళూరు-విజయవాడ నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డుకు పోయిన భూముల యజమానులు రోడ్డులో నీళ్ల పొలాల్లోకి చేరి పంటలు



నీటిలో మునిగిపోయిన పంట

నాశనం అవుతున్నాయని వేముల మండలం చింతల జూటూరు, పెద్ద జూటూరు, నల్లచెరువుపల్లి గ్రామాల రైతులు వాపోతున్నారు. నేషనల్ హైవే రోడ్డు నిర్మాణంలో పంట పొలాల్లోకి నీరు రాకుండా చూడాల్సిన కాంట్రాక్టర్లు పంట పొలాల్లోకి నీళ్ల వచ్చేలా రోడ్డు ఏర్పాటు చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నారు. పలుమార్లు వారిని అడ్డగించి అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలి యజేసినా ఫలితంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు పడినప్పుడు రోడ్డులో నీళ్ల పొలాల్లోకొస్తే ఎలా పండించుకోవాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. రోడ్డు వేశారులే అని పొలంలో పంట వేస్తే వర్షం పడినప్పుడు నీళ్లన్నీ పొలా ల్లోకి వచ్చి పంట నిట్టనిలువునా మునిగి కుళ్లిపోతోందని రైతులు వాపో తున్నారు. ఇప్పటికైనా గ్రీన్‌ఫీల్డ్ హైవే కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధులు, అధి కారులు తమ సమస్యను పరిష్కరించాలని రైతుల కోరుతున్నారు. గతంలో కూడా ఇలాగే వర్షాలు పడి పంటలు నీట మునిగిపోయి కుళ్లి పోయాయని తెలిపారు. రూ.లక్షలు నష్టం వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా పతినిధులు, అధికారులు న్యాయం చేయాలి

గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే రహదారి ఏర్పాటు చేసినందుకు ఎలాంటి ఇబ్బంది లేదు. రోడ్డు వేయడం వల్ల వర్షపు నీరు పొలాల్లోకి వచ్చి పంట అంతా నీటి పాలవుతోంది. నేషనల్ హైవే రహదారి సమీపంలో 15 ఎకరాల భూమిలో 5 ఎకరాలు రోడ్డుకు పోయింది. నష్టపరిహారం చాలా తక్కువ ఇచ్చినప్పటికీ రోడ్డు వచ్చిందన్న ఆనందంతో పట్టించుకోవడంలేదు. రోడ్డులో నీళ్ల పొలాల్లోకి రావడంతో రూ.లక్షలాది నష్టం వాటిల్లుతుంది. మునిగిపోయిన పంటకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలి. ఆ మేరకు అధికారులు స్పందించి వెంటనే పరిష్కారం చూపాలి.

- అన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి, రైతు

లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన ప్రత్యేక అధికారి

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు పట్టణంలోని లోతట్టు ప్రాంతాలను మండల ప్రత్యేక అధికారి, సోషల్ వెల్ఫేర్ డిడి సరస్వతి పరిశీలించారు. గత వారంలో పడిన వర్షాలకు జలమయమైన 4వ వార్డు చౌడేశ్వరి నగర్‌లో సోమవారం ఆమె పర్యటించారు. వర్షపు నీరు ఎక్కువగా నిలిచేందుకుగల కారణాలను పరిశీలించారు. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మొంథా తుఫాన్ ప్రభావంతో అధిక వర్షం పడితే వెంటనే పునరావస కేంద్రంలోకి చేరుకోవాలని ప్రజలకు సూచించారు. కాలనీ సమీపంలోని శాంతినికేతన్ హైస్కూల్లో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తహశీల్దార్ రాజసింహ నరేంద్రతో కలిసి వసతికి అవసరమైన గదులు, మరుగుదొడ్లు, తాగునీటి ఏర్పాట్లు పరిశీలించారు. మండల వ్యాప్తంగా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆమె ఆదేశించారు.

వసతి గృహంలో మరుగుదొడ్ల ఏర్పాటుకు చర్యలు..

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని వనిపెంట రోడ్డులో ఉన్న ఎస్సీ హాస్టల్ వసతి గృహంలో విద్యార్థులకు మరుగుదొడ్ల కొరత ఉందని, నిధులు మంజూరు చేయాలని వార్డెన్ గుప్తా డిడి సరస్వతిని కోరారు. వసతి



చౌడేశ్వరి నగర్ ప్రజలతో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి సరస్వతి(ఇన్‌సెట్) హాస్టల్లో మరుగుదొడ్లను పరిశీలిస్తున్న డిడి సరస్వతి

గృహాన్ని ఆమె తనిఖీ చేశారు. వర్షానికి విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూసుకోవాలని సూచనలు చేశారు. స్వచ్ఛభారత్ కింద మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, స్థానిక నాయకులు కోనా సుబ్బారావు పాల్గొన్నారు.

తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలు



పునరావాస కేంద్రాల పరిశీలనలో అధికారులు

ప్రజాశక్తి - తొండూరు

మండలంలోని పునరావాస కేంద్రాల్లో అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. స్పెషల్ ఆఫీసర్ సతీష్, తహశీల్దార్ బి.రామచంద్రుడు మండలంలోని పునరావాస కేంద్రాలను సోమవారం పరిశీలించారు. తొండూరు ప్రభుత్వ జూనియర్ కాలేజి, ఇనగలూరు, సంతకొవ్వూరు, ఆగడూరు జిల్లా పరిషత్ పాఠశాలలను పునరావాస కేంద్రాలుగా కేటాయించినట్లు తెలిపారు. అవసరమైన ఏర్పాట్లను సంబంధిత శాఖలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

సింహాద్రిపురం : మొంథా తుపాను ప్రభావంతో ఎలాంటి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం సంభవించకుండా అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టినట్లు తహశీల్దార్ వెంకట సాయినాథ్‌రెడ్డి, ఎంపిడిఒ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో పైడిపాలెం రిజర్వాయర్, నక్కలపల్లి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్, లోమడ చెరువు, లోమడ, బలపనూరు పునరావాస కేంద్రాలను సోమవారం వారు పరిశీలించారు. కార్యక్రమంలో పైడిపాలెం రిజర్వాయర్ డిఇ రామకృష్ణయ్య, జెఇ నాగేంద్ర, అబ్దుల్ రసూల్, వీఆర్వో ఓబయ్య పాల్గొన్నారు.

ఖాజీపేట : తుపాను ముంచుకొస్తున్న సందర్భంగా అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు సమాచారాన్ని రెవెన్యూ కార్యాల యంలోని కంట్రోల్ రూంకు చేరవేయాలని తహశీల్దార్ రవణమ్మ అధికా రులకు సూచించారు. తుఫాన్‌పై ఆయా శాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజలను అప్రమత్తం చేస్తూ అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తప్పవన్నారు.

17 వరద ప్రభావిత ప్రాంతాల గుర్తింపు : ఆర్‌డిఒ

పులివెందుల రూరల్ : మొంథా తుపాను తీవ్ర ప్రభావం చూపుతుందని, అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ సూచనల మేరకు ప్రభావిత ప్రాంతాల్లో అన్ని చర్యలు చేపట్టామని పులివెందుల ఆర్‌డిఒ చిన్నయ్య తెలిపారు. పులివెందుల రెవెన్యూ డివిజన్ పరిధిలోని 8 మండలాల్లో 17 వరద ప్రభావిత ప్రాంతాలను గుర్తించామన్నారు. మండలానికి ఒక స్పెషల్ ఆఫీసర్‌ను కలెక్టర్ నియమించారన్నారు. ఇప్పటికే వారు ఆయా మండలాలకు చేరుకున్నారని తెలిపారు. పులివెందుల మండలం ఎర్రబల్లె చెరువు, ఎస్సీ కాలనీ, పట్టణ పరిధిలోని ఎర్రగుడి పాలెం, ఇస్లాంపురం, లింగాల మండలం సిబిఆర్ ప్రాజెక్ట్, తొండూరు మండలం మగమూరు నది, వేముల మండలం యుసిఐఎల్ ప్రాజెక్ట్, మబ్బు చింతలపల్లె, వేముల కొత్తపల్లి, వేంపల్లి మండలం మదీనాపురం, ముత్తుకూరు బీసీ కాలనీ, అలిరెడ్డిపల్లె, వీరపునాయుని పల్లె మండలం తలపునూరు, గోనమాకులపల్లె ప్రాంతాల్లో ఇప్పటికే అధికారులు ఆయా ప్రాంత ప్రజలకు అవసరమైతే తప్ప ఇంటి నుండి ఎవరు కూడా బయటికి రావద్దని సూచించారని వివరించారు. రెవెన్యూ, పోలీస్, ఆర్‌డబ్ల్యుఎస్, వైద్య, ఐసిడిఎస్, శానిటేషన్, ఇరిగేషన్ శాఖల అధికారులు మూడు రోజులు ప్రభావిత గ్రామాల్లో నిత్యం పర్యవేక్షిస్తారని ఆర్‌డిఒ తెలిపారు.

ఎర్రగుంట్ల : తుఫాను ప్రభావం ఉన్న ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి కిరణ్‌కుమార్ అధికారులకు సూచించారు. తహశీల్దార్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ శోభన్‌బాబు, మున్సిపల్ కమిషనర్ శేషఫణి, ఎంపీడీవో వెంకటరమణయ్య, సీఐ విశ్వనాథరెడ్డి, రూరల్ విద్యుత్ ఏఈ చంద్రశేఖర్, ఫైర్ శాఖ ఎస్ఎఫ్ఓ శివశంకర్‌రెడ్డి, ఈఓపిఆర్డి రాములయ్య, ఎంఈఓ శివప్రసాద్, రూరల్ వైద్యాధికారి ప్రియాంక, హెల్త్ సూపర్వైజర్ ఓబులేసు పాల్గొన్నారు.

ముద్దనూరు : మొంథా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి రఘురాం సూచించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆయన మండలస్థాయి కమిటీ అధికారులతో సమావేశం నిర్వహించారు. తుఫాన్ వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి ఆదేశించారు. ప్రజలకు సురక్షితమైన ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. గ్రామాలను పరిశీలించి ప్రజలకు అవగాహన కల్పించారు. పలు సూచనలు సలహాలు చేశారు. అనంతరం జమ్మలమడుగు రహదారిలోని కుంగిన రోడ్డు బ్రిడ్జిని పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దార్ అలీఖాన్, ఎంపిడిఒ రాధాకృష్ణవేణి, సిఐ దస్తగిరి, డిప్యూటీ తహశీల్దార్ వరదకిషోర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ హరీష్, ఎపిఎం అపర్ణ, డాక్టర్ శ్రీకాంత్, ఎన్ఫోర్స్‌మెంట్ డిటి గోపినాథ్ మోరే, సిబ్బంది పాల్గొన్నారు.



ముద్దనూరు : కుంగిన బ్రిడ్జిని పరిశీలిస్తున్న అధికారులు

ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే రోజులొచ్చాయి



సంతకాల సేకరణలో మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

ప్రజాశక్తి - ఖాజీపేట

కూటమి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు సమీ పించాయని మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అ న్నారు. సోమ వారం మండల పరిధిలోని త్రిపురవరం, మిడు తూరు, సన్నపల్లె గ్రామాల్లో కోటి సంతకాల సేకరణ నిర్వ హించారు. పెద్ద ఎత్తున ప్రజలు సంతకాల సేకరణ కార్యక్ర మంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా జనరల్ సెక్రెటరీ రాఘవ రెడ్డి, మండల కన్వీనర్ మురళీమోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ మీగడ కృష్ణారెడ్డి, దుంపలగట్టు సర్పంచ్ రెడ్యం రామకృష్ణారెడ్డి, త్రిపురవరం నాగ సుబ్బారెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

చాపాడు : కూటమి ప్రభుత్వంలో పేద ప్రజలకు విద్య, వైద్యం దూరం చేసే ప్రయత్నం జరుగుతోందని మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని అల్లాడుపల్లె దేవరాల వద్ద సోమ వారం మెడికల్ కళాశాలల ప్రయి వేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధి కారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన 17 మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. ఇది అమల్లోకి వస్తే పేద విద్యార్థులకు వైద్య విద్య దూరమవుతుందన్నారు నవంబర్ 4న నియోజకవర్గ కేంద్రంలో నిరసన ర్యాలీ నిర్వహి స్తున్నామన్నారు. ప్రజలను చైతన్యం చేసి ర్యాలీలో పాల్గొనేలా చూడాలన్నారు. మండల పరిధిలో పదివేల మందితో సంతకాలు చేయిం చాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ టీ.లక్ష్మయ్య, వైసీపీ మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, నాయకులు రవిశంకర్‌రెడ్డి, కిషోర్ కుమార్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, సివి సుబ్బారెడ్డి, మహేష్ యాదవ్, సురేష్, జయరామిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేముల : దుగ్గన్నగారి పల్లి గ్రామపంచాయితీలో వైసిపి కోటి సంతకాల రచ్చబండ కార్యక్రమాన్ని ఆ పార్టీ మండల కన్వీనర్ నాగేళ్ల సాంబశివరెడ్డి, జడ్పీటీసీ కోకటం వెంకట బయపురెడ్డి, మండల పరిశీలకుడు లింగాల రామలింగారెడ్డి (వేల్పుల రాము), మాజీ పీసీబీ సభ్యులు మరక శివకృష్ణారెడ్డి, నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో వేమన నారాయణరెడ్డి, మధురెడ్డి, చల్ల వెంకట నారాయణ, రెడ్డెయ్య యాదవ్, విద్యా సాగర్ రెడ్డి, సుభాష్, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు : కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ ఆలోచనను విరమించుకోవాలని వైసిపి ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి కోరారు. సోమవారం పెద్దముడియం మండలం పెద్దపసుపుల గ్రామంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ మండల పరిశీలకులు చిన్నకొమెర్ల జగదీశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి కోటి సంతకాయల సేకరణ ప్రాముఖ్యతను కార్యకర్తలు, ప్రజలకు వివరించారు. వైసిపి నాయకులు రమణారెడ్డి, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



మురుగునీటిని పరిశీలిస్తున్న ఇఒ నాగభూషణంరెడ్డి

మురుగునీటి ఇబ్బందులు తొలగించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

వర్షాల కారణంగా వేంపల్లెలోని ఇమామ్‌నగర్ వీధిలో ఇళ్ల మధ్య నిలిచిపోయిన మురుగునీటిని తొలగించి, ఆ ఇబ్బందులు లేకుండా చూడాలని ఆ ప్రాంత మహిళలు అధికారులను వేడుకున్నారు. 20 రోజులుగా ఇమామ్‌నగర్ వీధిలో వర్షపు నీరు నిలిచిపోవడంతో స్థానికులు బయటికి రాలేని పరిస్థితి. మంగళవారం పంచాయతీ కార్యదర్శి నాగభూషణంరెడ్డి, టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ మురుగునీరు నిలిచి పోయిన ఇమామ్ నగర్ వీధిని పరిశీలించారు. ఆ ప్రాంత మహిళాలు అధి కారులను చుట్టుముట్టి అపరిశుభ్రతను తొలగించాలని కోరారు. డ్రెయినేజీ కాలు వలు లేక చిన్న పాటి వర్షానికి ప్రతిసారి ఇమామ్ నగర్‌లో నీరు నిల్వ చేరు తోందన్నారు. ఇంటి నుంచి బయటికి రావాలన్నా ఇబ్బందులు పడు తున్నామన్నారు. 50 కుటుంబాలున్న ఇమామ్ నగర్‌లో మోకాలు లోతు నీరు నిలిచి పాచి పట్టిందని మహిళలు వాపోయారు. డ్రెయినేజ్ కాలువలు ఏర్పాటు చేయాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి నాగభూషణం రెడ్డి మాట్లాడుతూ సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళతానని తెలిపారు. డ్రెయినేజి, రోడ్డు వేసేందుకు నిధులు ఖర్చు చేస్తామన్నారు.



రోడ్డు నియమాలపై విద్యార్థుల అవగాహన ర్యాలీ

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రమాదాలను నివారించాలని శ్రీశిరిడి సాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సుధ పేర్కొన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఎస్.ఉప్పలపాడు ప్రజలకు రోడ్డు నియమాల గురించి అవగాహన కల్పించారు. పోలీసు కానిస్టేబుల్స్ రమణ, అనిల్ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ పొంది ఉండాలన్నారు. ఫోర్ వీలర్ వాహనదారులు సీటు బెల్ట్ పెట్టుకోవాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. జిఎంఎస్‌కె యు. లలిత, (మహిళా కానిస్టేబుల్) పంచాయతీ కార్యదర్శి సంజీవ, సచివాలయం సిబ్బంది, ఎన్ఎస్-ఎస్ కో-ఆర్డినేట్ ద్వారకనాథరెడ్డి, కళాశాల డైరెక్టర్ సంజీవరెడ్డి పాల్గొనారు.



అవగాహన కార్యక్రమంలో శ్రీవేదవ్యాస డిగ్రీ కళాశాల విద్యార్థులు

జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధులు దరిచేరవు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక నెహ్రూరోడ్డులోని శ్రీవేదవ్యాస డిగ్రీ కాలేజి ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో సోమవారం భాగ్యనగర్ కాలనీలో విద్యార్థులు సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగించారు. కళాశాల కరస్పాండెంట్ ఎల్.నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకుంటే సీజనల్ వ్యాధులు దరి చేరవన్నారు. కళాశాల ప్రెసిడెంటు జి.సుదర్శనరెడ్డి మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఎన్ఎస్-ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వి.రామలక్ష్మిరెడ్డి మాట్లాడుతూ మొంథా తుఫాన్ వల్ల వర్షాలు ఎక్కువగా పడే అవకాశాలు ఉన్నందున, అవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించారు. కార్యక్రమములో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు కె.నాగరాజ, ఎస్‌పి యాసిన్ పాల్గొన్నారు.

ప్లాట్ల క్రమబద్ధీకరణ గడువు పొడిగింపు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణంలో లే అవుట్లు, ప్లాట్లను జిఓఆర్‌టి నంబర్ 1173 ప్రకారం క్రమబద్ధీకరణ చేసుకునేందుకు అవకాశం ఉందని మున్సిపల్ కమిషనర్ శేషఫణి, టిపిఒ రమణారెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని పౌరులు మూడు నెలలలోపు వచ్చే జనవరి 23లోగా ప్లాట్ల క్రమబద్ధీకరణకు(ఎల్ఆర్ఎస్) దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్, మున్సిపల్ కార్యాలయంలోనైనా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ప్రణాళికబద్ధమైన పట్టణ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

నేడు గండి క్షేత్రంలో బహిరంగ వేలం

చక్రాయపేట : రాయలసీమలో పేరు ప్రఖ్యాతి చెందిన గండి క్షేత్రంలో టెంకాయలు అమ్ముకొనుటకు మంగళవారం ఇటెండర్, స్టీల్ టెండర్, బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఇఒ జె.వెంకటసుబ్బయ్య, చైర్మన్ కావలి కృష్ణతేజ తెలిపారు. ఆయా హక్కు లను నిలుపుదల చేయు టకు, వాయిదా వేయుటకు దేవస్థానం కార్య నిర్వహణాధికారికి పూర్తిగా అధికారం ఉందన్నారు.